بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ    وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Hadzrat Khalifatul Masih V 14.02.2020 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప అనుచరులైన హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లమ (రజి) సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 14.02.2020 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనా నంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. గత ఖుత్బాలో హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లమ గురించి ప్రస్తావించబడెను. మిగిలిన కొంత భాగము నేడు ప్రస్తావించబడును. ఇన్ షాఅల్లాహ్. కాబ్ బిన్ అష్రఫ్ హత్య ప్రస్తావనలో హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లమ అతనిని ఒక సాకుతో ఇంటి నుండి దూరము తీసుకెళ్ళి హత్య చేసెను, మరి అది అసత్యము కాదా? అని ప్రస్తావించబడెను. ఒక హదీసు వలన కొందరు ధర్మ పండితులు మూడు సందర్భములలో అబద్ధమాడు అనుమతి గలదని నమ్ముతారని తెలుప బడెను. మూడు సందర్భములలో అసత్యమాడుటకు అనుమతి గలదని భావించుట వాస్తవానికి తప్పుడు ఆలోచన లేదా హదీస్ తప్పుడు విశ్లేషణ. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మూడు సమయములలో అసత్యమాడుటకు లేదా తమ మతమును గుప్తముగా నుంచుకొనుటకు అనుమతి ఇచ్చారని ఒక క్రైస్తవుని ఇదే విమర్శకు సమాధానంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. సత్యము కొరకు ఎంతగా పవిత్ర ఖుర్ఆన్‌లో ఆదేశించబడెనో అందులోని పదవ వంతు కూడ క్రొత్త నిబంధనలో ఆదేశించబడలేదు. అసత్యము అన్యారాధనకు సమానమని పవిత్ర ఖుర్ఆన్ బోధించెను. అల్లాహ్ తఆలా ఇట్లు నుడివెను.

فَاجْتَنِبُوا الرِّجْسَ مِنَ الْاَوْثَانِ وَاجْتَنِبُوْا قَوْلَ الزُّوْرِ

అనగా విగ్రహాల మలినము నుండి అసత్య మలినము నుండి దూరముండుము. మరో చోట ఇట్లు నుడివెను.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُوْنُوْا قَوّٰمِيْنَ بِالْقِسْطِ شُهَدَآءَ لِلّٰهِ وَلَوْ عَلٰۤى اَنْفُسِكُمْ اَوِ الْوَالِدَيْنِ وَالْاَقْرَبِيْنَ

అనగా ఓ విశ్వాసులారా! మీకు, మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు విరుద్ధముగానున్నను మీరు పరిపూర్ణముగా న్యాయమునే పాటింపుము. ఓ దేవునికి భయపడని వ్యక్తి! నిజము చెప్పాలని ఇటువంటి ఆదేశము క్రొత్త నిబంధనలో ఎక్కడ వున్నదో చూపించుము.

ఫతహ్ మసీహ్ అయిన ఆ క్రైస్తవునిని సంబోధింస్తు వారిట్లు వ్రాసిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మూడు సందర్భాలలో అసత్యము పలుకవచ్చునని అనుమతించారనే విషయములో నువ్వు పొరబడ్డావు. వాస్తవమేమనగా ఏ హదీసులో కూడ అసత్యమునకు అనుమతి ఇవ్వబడ లేదు. హదీసులో اِنْ قُتِلْتَ وَاُحْرِقْتَ అనగా నువ్వు హతమార్చబడినా, దహనము చేయబడినా సత్యమును వీడకుమనే పదములు గలవు. మీ ప్రాణములు పోయినను మీరు సత్యమును వీడకూడదని పవిత్ర ఖుర్ఆన్‌లో వుండగా మీరు హతమార్చబడినా, దహనము చేయబడినా మీరు సత్యమును వీడకూడదని హదీసులో వుండగా ఏదేని హదీసు పవిత్ర ఖుర్ఆన్‌కు లేదా స్వచ్ఛమైన హదీసులకు విరుద్ధముగా తేలినచో అది ఆచరించదగ్గది కాదు. ఎందుకనగా స్వచ్ఛమైన హదీసులు, పవిత్ర ఖుర్ఆన్‌కు విరుద్ధముగా కాని హదీసునే మేము స్వీకరిస్తాము.

స్పష్టమైన అబద్ధము ఇస్లాంలో మలినము, నిషిద్ధము, అన్యారాధనకు సమానము. కాని తౌరియా తప్పని పరిస్థితిలో సాధారణ ప్రజల కొరకు హదీసులో అనుమతించబడెను. కాని అది స్పష్టమైన అబద్ధము కాదు. తౌరియా నుండి దూరమున్న వారే గొప్పవారని వ్రాసి వున్నది. తౌరియా గొప్ప స్థాయి గల నిష్ఠాపరతకు వ్యతిరేకం. హతమార్చబడినా, దహనము చేయబడినా స్పష్టమైన సత్యమే మేలైనది. (తౌరియా అనగా ఒక విషయమును నానార్థములు గల పదాలలో చెప్పుట.)

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేను హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ శేష జీవితము గురించి తెలుపుతాను. మోసముతో గిర్ని రాయి వేసి ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను హతమార్చాలని బనూ నజీర్ తెగ కుట్ర పన్నినప్పుడు అల్లాహ్ తఆలా దివ్యవాణి ద్వారా ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలిపెను. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు

అలైహి వసల్లం అక్కడి నుండి వేగంగా లేచిరి. ఏదో అత్యవసర పని కొరకు లేచినట్లు వారు నిలబడిరి. వారు సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు చేరుకొనిరి. కొంచెం సమయము వరకు అనుచరులు నిరీక్షించి వారు కూడ వారి వెనుక మదీనాకు చేరుకొనిరి. అనుచరులు మదీనాకు చేరుకోగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం ముహమ్మద్ బిన్ మస్లమను పిలిపించారని వారికి తెలిసినది. ఓ దైవ ప్రవక్తా! మీరు అక్కడి నుండి లేచి వచ్చిరి. మాకు తెలియనే తెలియలేదని హజ్రత్ అబూబకర్ వేడుకొనగా వారిట్లనిరి. యూదులు నన్ను మోసము చేయుటకు సంకల్పించిరి. అందుకే నేను అక్కడి నుండి వచ్చేసితిని.

హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పిలిచి ఇట్లనిరి. బనూ నజీర్ యూదుల వద్దకు వెళ్ళి నా నగరము నుండి వెళ్ళి పొమ్ము అనే సందేశము తెలుపుము. హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ యూదుల వద్దకు చేరుకొని ఇట్లనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందేశముతో నన్ను మీ వద్దకు పంపిరి. కాని అంతకు ముందు ఒక విషయము జ్ఞాపకము చేయించిన తర్వాత నేను మీకు సందేశము అందిస్తాను. ఆ విషయము మీరు మీ సభలలో మాట్లాడుకునేవారు. అదేమిటి? అని యూదులు అడిగిరి. హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా మూసాపై అవతరింపజేసిన బైబిల్ ప్రమాణముతో ఒక విషయము నేను మీకు గుర్తు చేయిస్తున్నాను. హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ప్రభవించక ముందు నేను మీ వద్దకు వచ్చేవాడినని మీకు తెలుసు. అప్పుడు మీరు బైబిల్ తెరుచుకొని వుండిరి. మీరు నాతో ఆ సభలో ఇట్లడిగితిరి. ఓ మస్లమ కుమారుడా! మీరు ఆశించినచో మేము మీకు భోజనము అందించెదము. లేదా మిమ్ములను మా ధర్మములో చేర్చుకొందుము. హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ ఇంకా ఇట్లు తెలిపిరి. అప్పుడు నాకు భోజనము వండించండని, అల్లాహ్ ప్రమాణముగా నేను ఎన్నటికి యూదునిగా మారనని నేను మీతో అంటిని. అప్పుడు నాకు మీరొక పాత్రలో భోజనము వండించిరి. అప్పుడు మీరు నాకిట్లు చెప్పిరి. భవిష్యత్తులో మీ వద్దకు ఒకరు వత్తురు. అతడు నవ్వు ముఖము కలిగి వుండును, అతడు యుద్ధము చేయును, అతని కండ్లలో ఎర్రదనముండును, అతడు యెమెన్ వైపు నుండి వచ్చును, అతడు సవారీగా ఒంటెను ఉపయోగించును, అతడు పంచె ధరించును, కొంచెం తోనే అతడు సరిపెట్టుకొనును, వారి ఖడ్గము వారి భుజముపై వుండును. అతడు వివేకముతో సంభాషించును, అతడు మీకు బంధువుగా కనిపించును. ఇదంతా విని యూదులు ఇట్లనిరి. అవును, మేము ఇలాగే మాట్లాడేవారము. కాని ఇతడు ఆ ప్రవక్త కాదు. అనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ప్రవక్త కాదు. హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ ఇట్లనిరి. మీకు గుర్తు చేయించ దలచిన నా మాట మీకు నేను వినిపించాను. నన్ను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపారు. వారి సందేశమిట్లు గలదు. నేను మీతో చేసిన ఒప్పందమును మీరు ఉల్లఘించారు. ఎందుకనగా మీరు నన్ను మోసము చేయదలచితిరి. అమర్ బిన్ జహ్హాష్ కోటపై ఎక్కి నన్ను హతమార్చుటకు ప్రయత్నించెను. ఇది విని వారికి మౌనము మాత్రమే మిగిలెను. వారేమి మాట్లాడలేక పోయిరి. అనంతరం హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ ఇట్లనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇట్లు తెలిపిరి. నేను మీకు పది రోజుల గడువు ఇస్తున్నాను. మీరు నా నగరము విడిచి వెళ్ళిపోండి. అనంతరం ఇక్కడ కనిపించిన వ్యక్తి తల నరికి వేయబడును. కొన్ని రోజుల వరకు యూదులు సన్నాహాలు చేసుకొనిరి. వారి పశువులు జూ మజద్ ప్రాంతములో యుండెను. వాటిని అక్కడి నుండి తీసుకొచ్చిరి. బనూ అష్జఅ తెగ నుండి వారు ఒంటెలను కిరాయాపై తీసుకొనిరి. ఇలా బయలుదేరుటకు పూర్తిగా సిద్ధమైరి.

యూదుల వ్యవహారమును తెలుపుచు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజ ఇట్లు తెలిపిరి. బనూఖురైజ వారి తిరుగుబాటు విస్మరించదగ్గది కాదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఖైబర్ యుద్ధము నుండి తిరిగి రాగానే మీరు గృహములలో విశ్రాంతి తీసుకోకండి, సాయంత్రం కాక ముందే బనూ ఖురైజ కోటలకు చేరుకోండి. అనంతరం ఎందుకు తిరుగుబాటుకు పాల్పడినారో ప్రశ్నించమని వారు అలీని బనూ ఖురైజ వారి వద్దకు పంపిరి. బనూ ఖురైజ పశ్చత్తాపము వ్యక్తపరిచే బదులు లేక క్షమాపణ కోరే బదులు హజ్రత్ అలీని, వారి సహచరులను దూషించడం మొదలు పెట్టిరి. ఇంత వరకే ఆగక రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి కుటుంబ మహిళలను సైతం దూషించిరి. ఈ సమాధానము తీసుకొని హజ్రత్ అలీ

తిరిగి వస్తుండగా మార్గ మధ్యలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇతర అనుచరులతో కలిసి యూదుల కోటల వైపు వస్తు కలిసిరి. వారు యూదుల కోటల వద్దకు చేరుకోగా యూదులు తలుపులు మూసుకొని, ముస్లిములతో యుద్ధము మొదలు పెట్టిరి. తుదకు వారి స్త్రీలు కూడ యుద్ధములో పాల్గొనిరి. కొందరు ముస్లిములు కోట గోడకు ఆనుకొని కూర్చొని వుండగా ఒక యూద స్త్రీ పై నుంచి రాయి విసిరి ఒక ముస్లిం వ్యక్తిని హతమార్చెను.

బనూ ఖురైజలోని ఒక వ్యక్తి అమర్ బిన్ సు'ది ఆ జాతి నాయకులలో ఒకడు. అతడు తన జాతిని నిందిస్తు ఇట్లనెను. మీరు తిరుగుబాటకు పాల్పడినారు. ఒప్పందమును ఉల్లఘించారు. కనుక ఇప్పుడు మీరు ముస్లిములుగా మారండి లేక పన్ను చెల్లించుటకు సిద్ధ పడండి. మేము ముస్లిములము కాము, పన్ను చెల్లించము, మరణించుట ఇంతకంటే మేలని యూదులు బదులిచ్చిరి. నాకు మీకు ఎలాంటి సంబంధము లేదని చెప్పి ఆ వ్యక్తి కోట నుండి బయటకు వచ్చెను. అతడు కోట నుండి బయటకు వస్తుండగా ముస్లిముల ఒక సైన్యమునకు నాయకత్వము వహిస్తున్న హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లమ అతనిని చూచి ఎవరని ప్రశ్నించిరి. నేను ఫలానా అని అతడు సమాధానమిచ్చెను. అందుకు ముహమ్మద్ బిన్ ముస్లమ నువ్వు సురక్షితంగా వెళ్ళుమని అతనితో అనిరి. అనంతరం అల్లాహ్ తఆలా తో ఇట్లు దుఆ చేసిరి. ఓ అల్లాహ్ మంచి వ్యక్తుల తప్పులను విస్మరించు వంటి సత్కర్మలు చేయుటకు నన్ను అనుగ్రహించుము. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలియగా వారు ముహమ్మద్ బిన్ మస్లమను కోప్పడక వారి ఈ పనిని ప్రశంసించిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధన, శిక్షణ ప్రకారము ముస్లిములు ఎల్లప్పుడు న్యాయముగా వ్యవహరించారని తేలి పోయెను.

ఖైబర్ వాసుల, అబూరాఫి యూదుని దుష్పర్యల సంఘటన తెలుపుతు హుజూరె అన్వర్ ఇట్లనిరి. అబూ రాఫిను హతమార్చిన వారిలో ముహమ్మద్ బిన్ మస్లమ కూడ పాల్గొనిరి. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ ఈ సంఘటనను ఇట్లు వివరించిరి. యూదులలో దుష్ట నాయకులైన కొందరి కుట్రలు, రెచ్చ గొట్టడం వలన అహ్జాబ్ యుద్ధము సంభవించెను. అటువంటి నాయకులలో ఒకడైన హుయ్యి బిన్ అఖ్తబ్ బనూఖురైజ సంఘటనలో తన శిక్ష అనుభవించి, అంతమయ్యెను. కాని ఇంకా సలామ్ బిన్ అబిల్ హుఖీఖ్ ఉర్ఫ్ అబూ రాఫి ఖైబర్ ప్రాంతములో యథా విధిగానే స్వతంత్రముగా పీడనమునకు పాల్పడుచుండెను. అతడు నజద్‌లోని క్రూరమైన తెగలను ముస్లిములకు విరుద్ధముగా రెచ్చగొట్టుచుండెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో శత్రుత్వము నెరుపుటలో కాబ్ బిన్ అష్రఫ్‌నకు సమానంగా ఇతడుండెను. అతడు ఘత్ఫానీయులకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వ్యతిరేకంగా దాడి చేయుటకు పెద్ద మొత్తంలో ధన సహాయము చేసెను. అబూరాఫి ఇంతటితో ఆగ లేదు. అతడు శత్రుత్వము వలన ముస్లిముల రక్త పిశాచిగా మారెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉనికి అతని కంటికి ముల్లు వలె కుచ్చుకుంటుండెను. అహ్జాబ్ యుద్ధము వలె నజద్ తెగలను, ఇతరు తెగలను ప్రోగు చేయడం మొదలు పెట్టెను. ఈ విధంగా ముస్లిములను అంతమొందించుటకు ఒక పెద్ద సైన్యమును సమకూర్చడం ప్రారంభించెను. ఇంత వరకు పరిస్థితి దిగజారడంతో ముస్లిములకు మరల అహ్జాబ్ యుద్ధము సమీపిస్తున్నట్లు భావన కలిగెను. అప్పుడు ఖజ్రజ్ తెగలోని కొందరు అన్సారి అనుచరులు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఈ మోసమును ఎదుర్కొనుటకు ఏదో ఒకటి చేయాలి, ఏదో ఒక రకంగా దీని వ్యవస్థాపకుడు అబూ రాఫిని హతమార్చాలని వేడు కొనిరి. దేశములో రక్త పాతము జరిగే బదులు ఒక దుష్టున్ని హతమామర్చడం మంచిదని భావించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి అనుమతించిరి. అబ్దుల్లాహ్ బిన్ అతీక్ అన్సారి నాయకత్వములో నలుగురు అనుచరులను పంపిరి. వారిలో హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ కూడ వుండిరి. వీరిని అబూరాఫి వైపు పంపుతున్నప్పుడు స్త్రీని గాని, పిల్లలను గాని ఎట్టి పరిస్థితిలో హతమార్చకూడదని గట్టిగా దేశించిరి. కావున హిజ్రి 6వ సం॥లో రమజాన్ మాసములో ఈ బృందము బయలు దేరెను. అతి చాకచక్యంతో తన పని పూర్తి చేసుకొని తిరిగి వచ్చెను. ఈ విధంగా ఆ అపదల మేఘాలు తొలగి పోయెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. సీరత్ ఖాతమున్న బియ్యీన్‌లో ఇట్లు వ్రాసి వుంది. అబూరాఫి హత్య గురించి ఎలాంటి సందేహమునకు పాల్పడవలసిన అవసరం

లేదు. అబూరాఫి దుష్కర్యలు అందిరికి తెలిసినవే.

అప్పుడు ముస్లిములు అతి బలహీన స్థితిలో నలు వైపుల ఆపదలలో చిక్కుకొని వుండిరి. దేశమంతా ముస్లిములను తుదిముట్టించాలని ఏకమగుచుండెను. ఇటువంటి సున్నితమైన సమయములో అబూరాఫి అరబ్‌లోని వివిధ తెగలను ఇస్లాంకు విరుద్ధముగా రెచ్చ గొట్టుచుండెను. అహ్‌జాబ్ యుద్ధము వలె అరబ్ క్రూర తెగలను ఏకము చేసి మరల మదీనాపై దాడి చేయాలని ప్రయత్నము చేస్తుండెను. ఫిర్యాదు చేయుటకు అరబ్‌లో అప్పుడు ఎలాంటి ప్రభుత్వము లేకుండెను. ప్రతి తెగ తమకు తాము స్వతంత్రము, అధికారము కలిగి వుండెను. ఏది ఏమైనప్పటికి ఇటువంటి పరిస్థితులలో అనుచరులు సరియైనదే చేసిరి. ఒక జాతి జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పుడు ఇటువంటి ప్రణాళికలు రచించుట ధర్మబద్ధముగా భావించబడును.

హజ్రత్ ఉస్మాన్ అమరులైన తర్వాత హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ పూర్తిగా ఒంటరి జీవితమునకు అలవడిరి. కర్రతో ఒక ఖడ్గము చేయించుకొనిరి. తర్వాత హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లమ ఇట్లు తెలిపిరి. నాకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక ఖడ్గము బహుకరించి, ఇట్లనిరి. మీతో అన్యారాధకులు యుద్ధము చేయునంత వరకు దీనితో యుద్ధము చేయుము. ముస్లిములు పరస్పరం తలలు నరుక్కొంటున్నట్లు నువ్వు చూసినప్పుడు దీనిని ఒక రాయిపై కొట్టి విరగ్గొట్టుము. ఎవరైనా ఒకరు నిన్ను హతమార్చునంత వరకు లేదా మరణము వచ్చునంత వరకు నువ్వు ఇంట్లోనే కూర్చొను ము. కావున వారు ఇలాగే చేసిరి. వారు పీడనములతో దూరముండిరి. అందుకే జమల్, సఫ్ఫైన్ యుద్ధములలో వారు పాల్గొన లేదు.

వీరి మృతి గురించి విభేదము గలదు. కొన్ని కథనముల ప్రకారము వీరు హిజ్రి 43, లేదా 46 లేదా 47 సంవత్సరములో మదీనాలో మృతి చెందిరి. అప్పుడు వారి వయసు 77 సంవత్సరములుండెను. వారి జనాజ నమాజ్ అప్పటి మదీనా అమీరైన మర్వాన్ బిన్ హకమ్ చదివించిరి. కొన్ని కథనముల మేరకు వారు అమరులైరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజుల తార్వత నేను ఒక ప్రత్యక్ష జనాజ నమాజ్ చదివింతును. ఇది గౌ॥ తాజ్ దీన్ వల్లు సదర్ దీన్ గారిది. 10 ఫిబ్రవరి తేదీన 84 సం॥ల వయసులో వీరు మృతి చెందిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము మృతుడు మూసీగా వుండెను. వీరు యుగాండాలో జన్మించిరి. 1967 సం॥లో ఇంగ్లాండ్ వలస వచ్చేసిరి. 1984 సం॥లో ఇస్లామాబాద్‌లో స్థలము కొన్నప్పుడు వీరు ఇస్లామాబాద్ కొరకు తమ సేవలను సమర్పించిరి. అనంతరం 22 సం॥ల వరకు ఇస్లామాబాద్‌లో అతి వినయముతో నిస్వార్థ సేవలందించిరి. ఇస్లామాబాద్‌లోని మొదటి జల్స నిర్వహణ నుండి చివరి జల్స వరకు చాలా నిర్విమంగా శ్రమించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథులకు విశ్రాంతి, ప్రతి సౌకర్యము అందించుటకు కృషి చేసిరి. అల్లాహ్ తఆలా వారిని కరుణించి క్షమించు గాక! వారి సంతానము వారి వలె వినయము, విశ్వసనీయతలో ముందడుగు వేయును గాక! వారికి సహనము, స్థైర్యము కలిగించు గాక!

*(Summary: Office Nashr-o-Isha'at, ranslation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |